# వర్షాలు, వ్యాధులు, వనవాసం

కె.బాలగోపాల్

ఉప ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సమితి అనుకున్నంత ఘనంగా విజయాలు సాధించుకోపోవడం వల్ల నష్టాలు చాలానే ఉండగలవుగానీ ఒక లాభం కూడ ఉండగలదు. తెలంగాణ ఉద్యమకారులు ఇకనైనా ప్రజల నిత్యజీవిత సమస్యలపైన ఉద్యమాలు నిర్మించే కర్తవ్యాన్ని చేపడతారేమో. రాజకీయ లక్ష్యం ఏదైనా, ప్రజల సమస్యలపైన వారిని సంఘటితం చేస్తూ అటువైపు నడిపించడమే సరయిన మార్గమన్న స్పృహ తెలంగాణకు కొత్తకాదుగానీ, తెలంగాణ సాధనకు పోరాటాలూ త్యాగాలూ అవసరం లేదని కెసిఆర్ ఏనాడయితే అన్నాడో తెలంగాణ ఉద్యమకారులందరూ దానిని మరచిపోయారు. ఈ వెనకడుగు నుంచి మరచిపోయిన ఆ చైతన్యాన్ని మళ్లీ పొందుతారేమో చూద్దాం.

తీవ్రమైన సమస్యలయితే చాలానే ఉన్నాయి. అన్నీ ప్రాంతీయ వివక్ష నుంచీ ప్రాంతీయ ఆధిపత్యం నుంచీ పుట్టినవి కాకపోవచ్చును గానీ అన్నీ వికృతమైన పాలనా విధానాల నుంచి పుట్టినవే. పత్రికల పుణ్యాన కొన్ని వార్తలవుతుంటాయి, పత్రికలకూ పట్టనివి వార్తలూ కావు.

ఆదివాసీ ప్రాంతాలలో జ్వరాలు, మరణాల గురించి వార్తలు అప్పుడప్పుడు పత్రికలలో వస్తుంటాయి. తరుచుగా ఆదిలాబాద్, విశాఖపట్నం ఏజెన్సీల నుంచి ఈ రకమైన వార్తలు వస్తుంటాయి. అప్పుడప్పుడు దక్షిణాన నల్లమల ప్రాంతం నుంచి కూడ వస్తుంటాయి. రాష్ట్రంలో ఆదివాసులు నివసించే అటవీ ప్రాంతం విస్తారంగా ఉండగా, ఈ రెండు మూడు ప్రాంతాల నుంచే ఈ రకమైన అకాల మరణాల వార్తలు ఎందుకు వస్తాయనేది కొంతమేరకు మిస్టరీయే. పత్రికల స్పందనలోని తేడాయే తప్ప అకాల మరణాలు ఏజెన్సీ అంతటా ఉన్నాయన్న అభిప్రాయం చాలామందిలో ఉంది. ఇది కొంతమేరకు నిజం కావచ్చు. ఉదాహరణకు నల్లమల ప్రాంతపు చెంచులలో అనారోగ్యం, ఆహార లేమి, రక్తహీనత, తత్ఫలితమైన మరణాలు ఎక్కువేగానీ మీడియా స్పందన సాపేక్షంగా తక్కువ కావడం వల్ల అంతగా బయటకురావు.

అయితే 'జ్వరాల' వార్తలు వచ్చే ఆదివాసీ ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలన్నిటిలోనికీ బాగా వెనుకబడినవి. వర్షాధార వ్యవసాయం, ఆహార సేకరణ పైన ఆధారపడి ఉండడం, సరయిన రవాణా సౌకర్యాలు లేక పోవడం, వేరే పనులేవీ దొరకక పోవడం, వైద్యం చాలా తక్కువగా అందుబాటులో ఉండడం, అధికార యంత్రాంగంలో నిర్లక్ష్యం సగటు కంటే ఎక్కువ ఉండడం ఈ ప్రాంతాల లక్షణాలు. దీనికి నైసర్గిక కారణాలు ఉండనే ఉన్నాయి. ఇవి ఎగుడుదిగుడు నేలలున్న మారుమూల ప్రాంతాలు. ఇదికాక సామాజిక రాజకీయ కారణాలేమున్నాయో అన్వేషించాలి. కాబట్టి నిజంగానే చావులు ఇక్కడే ఎక్కువ కావచ్చు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు ఏజెన్సీ నుంచి ఈ మధ్య జ్వరాలు, అకాల మరణాల వార్తలు



మళ్లీ వస్తున్నాయి. 1998 వర్షాకాలంలో ఆ ఏజెన్సీలో ఎంతలేదన్నా 1500 నుంచి –బహుశా రెండు మూడువేల మంది– అతిసార వ్యాధికి బలయి చనిపోవడం చాలా సంచలనం సృష్టించింది. నిరుడు వర్షాకాలం ముగిసిన తరువాత అంతటి మోతాదులో మరణాలు లేకపోయినా చిన్న పిల్లలు కనీసం 300 మంది రెండు మూడు మండలాలలో రెండు నెలల వ్యవధిలో చనిపోయారు. అప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం, నిరుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే భాషలో ఏం జరగలేదని బుకాయించ జూశాయి.

ఈ సంవత్సరం మే నెల మొదటి రెండు వారాలలోనే నార్నూరు మండలంలోని కోలామ గ్రామంలో 12 మంది చనిపోవడం రాబోయే వర్షాకాలంలో ఉండగల పరిస్థితికి సూచికగా వార్తలకెక్కింది, ఆ మండలంలోనూ, పొరుగున ఉన్న సిర్పూరు (యు) ఉట్నూరు మండలాల్లోనూ చాలా ఊర్లలో ముగ్గురు నలుగురు చొప్పున చనిపోయారు. చనిపోయిన వారిలో సగం దాకా పసిపిల్లలే.

1998లో అతిసార మరణాలు లేవు లేవని ప్రభుత్వం బుకాయించినప్పటికీ హైకోర్టులో కేసు వేయగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ నిజాయితీగానే నిజం ఒప్పుకున్నారు. ఉట్నూరు ఏజెన్సీలోని అనేక గ్రామాలలో రక్షిత మంచినీటి వ్యవస్థ లేదనీ ఆ కారణంగా ప్రజలు కలుషితమైన నీళ్ళు తాగవలసి రావడం అతిసార వ్యాధికి దారితీసిందనీ కోర్టుకు తెలిపారు. ఇన్ని సంవత్సరాల సంక్షేమ పాలన అనంతరం కనీసం శుభ్రమైన మంచి నీళ్ళివ్వలేకపోవడం–అది కూడ ఒక ఊరిలో రెండు ఊర్లలో కాదు, ఆదివాసీ ప్రాంతమైన ఒక రెవెన్యూ డివిజన్ పర్యంతం సిగ్గ పడవలసిన విషయమే అయినప్పటికీ ఆ మాత్రం కోర్టుకు రాతపూర్వకంగా చెప్పడం విశేషమే.

ఇక మీదట అన్ని గ్రామాలలో గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా శుభ్రమైన నీరిస్తామని హామీ ఇచ్చిన పిదప హైకోర్టు ఆ కేసును మూసేసింది.

ఆ హామీ కొంతమేరకు అమలయిందిగానీ సమగ్రంగా కాలేదని 10 సంవత్సరాల తరువాత తెలుసుకుంటున్నాం. రెండు వారాలలో 12 మంది చనిపోయిన కోలామలో గ్రౌండ్ లెవెల్ నీళ్ల ట్యాంకు ఉందిగానీ దానికి నీళ్లు చేరవేసే బోరు ఖరాబయి రెండు నెలలయింది. ఎన్ని ఫిర్యాదులు చేసినా దానిని బాగుచేసిన వారు లేరు. ఊరిజనం చేతి బోరు నీళ్లు తాగుతున్నారు. దాని ఫ్లాట్ ఫాం విరిగిపోవడం వల్ల బోరు దగ్గర మురుగునీరు భూమిలోకి ఇంకి నీళ్లు కలుషితం అయ్యాయి. అన్ని మరణాలకూ ఇదే కారణమా అంటే ఎవరు చెప్పాలి? వాళ్ళను చూసిన వైద్యుడెవరు? మరికొన్ని ఊళ్ళలో రక్షిత మంచినీటి వ్యవస్థ అమలులోకే రాలేదు. మహారాష్ట్ర సరిహద్దు గ్రామమయిన సేద్వాయిలో నీళ్ల ట్యాంక్ లేదు. చిత్తగూడలో మంజూరయిందిగానీ ఇంకా కట్టలేదు. లోకారిలో ట్యాంక్ ఉంది, బోర్ ఉంది కానీ కరెంటు సరిగ్గా సరఫరా కాక పోవడం వల్ల ట్యాంక్ తరుచుగా ఖాళీ అయిపోతుంది. ఇటువంటి ఊళ్లు ఇంకెన్ని ఉన్నాయో, రేపు వర్షాలు వచ్చిన తరువాత ఆ ఊళ్లనుంచి ఎన్ని చావుల కథలు వినవలసి వస్తుందో.

రోగాలకు కారణం ఒకెత్తయితే తట్టుకునే సత్తా లేక పోవడం, నయంచేసే వైద్య వ్యవస్థ లేకపోవడం దానికి తోడయ్యాయి. నిజానికి ఏజెన్సీ ప్రాంతాలలో వైద్య వ్యవస్థ కాగితం మీద బాగానే ఉంది. ఒక్కొక్క మండలంలో ఒకటిగానీ అంతకంటే ఎక్కువ గానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. (నార్నూరు మండలంలో మూడున్నాయి). అవికాక సబ్ సెంటర్లున్నాయి. గ్రామాలలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉన్నారు. కాగితం మీదచూస్తే ఇంతకంటే మెరుగైన వ్యవస్థ ఉండగలదా అనిపిస్తుంది. అయితే 'ఆదివాసీ ప్రాంతాలలో రోగులు వైద్యుల దగ్గరకు రారు, వైద్యులే రోగుల దగ్గరకు పోవాలి' అన్న సూత్రం ఏ మాత్రం అమలులో లేదు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, సబ్ సెంటర్లలోని హెల్త్ అసిస్టెంటులు రోగనిర్ధారణ తెలియనివారు. ఏ గోలీలివ్వాలో చెప్తే ఇవ్వగల వారు మాత్రమే. లేదా పైకి కనిపించే లక్షణాలను బట్టి ఇస్తారు. వైద్యుల మాటకొస్తే దాదాపు ఎవరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిత్యం అందుబాటులో ఉండరు. చాలా మంది వారాని కొకసారి ఆ ఊర్లో అంగడి (సంత) జరిగే రోజున మాత్రమే ఆస్పత్రికి పోవడం అలవరుచుకున్నారు. ఆదివాసు

**'ఆదివాసీ ప్రాంతాలలో రోగులు వైద్యుల దగ్గరకు రారు, వైద్యులే రోగుల దగ్గరకు పోవాలి' అన్న సూత్రం ఏ మాత్రం అమలులో లేదు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, సబ్ సెంటర్లలోని హెల్త్ అసిస్టెంటులు రోగనిర్ధారణ తెలియని వారు. ఏ గోలీలివ్వాలో చెప్తే ఇవ్వగలవారు మాత్రమే. లేదా పైకి కనిపించే లక్షణాలను బట్టి ఇస్తారు. వైద్యుల మాటకొస్తే దాదాపు ఎవరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిత్యం అందుబాటులో ఉండరు.**

లకు అనేక అవసరాలు అంగడికి పోయినప్పుడు తీర్చుకోవడం అలవాటే. సినిమాచూసి వస్తారు, హోటళ్ళలో రుచికరమైన మిఠాయిలు తిని వస్తారు. రంగురంగుల రిబ్బన్లు కొనుక్కుంటారు. ఇప్పుడు డాక్టర్‌ను కూడా ఆ రోజే చూసివస్తారు. కాని రోగానికి ఈ టైం టేబిల్ తెలీదు కదా.

రోగాలకు తట్టుకోవడానికి ఒంట్లో సత్తా లేక పోవడం బహుశా చావులకు అన్నిటికంటే ముఖ్యమైన కారణం. పిల్లల కళ్లలో సహజంగా ఉండే వెలుగు, చురుకుదనం ఈ ప్రాంతాలలో కనిపించవు. తీవ్ర రక్తహీనత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దీనిని నివారించే వ్యవస్థ లేకపోలేదు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా స్కూలు పిల్లలకు పౌష్టికాహారం అందించే ఏర్పాటు ఉంది. దానికి కావలసినన్ని నిధులున్నాయి. దాన్ని సక్రమంగా అమలు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. ఎన్ని ఉన్నా వ్యవస్థలో సంకల్పం లేనిదే ఏం ప్రయోజనం? రెండు వారాలలో 12 మంది (అందులో సగం మంది పసిపిల్లలు) చనిపోయిన కోలామ గ్రామాన్నే ఉదాహరణగా తీసుకుంటే ఆ ఊరిలో స్కూలుంది. టీచర్ల పోస్టులు రెండున్నాయి. రెండు పోస్టులూ నింపారు కానీ టీచర్లిద్దరూ ఏ రోజూ స్కూలుకు రారు. టీచర్లే రాకపోతే మధ్యాహ్న భోజన పథకాన్ని ఎవరు అమలు చేయాలి? అంగన్ వాడీ కేంద్రాలూ, ఉప కేంద్రాలూ చెప్పుకోవడానికి అన్ని గ్రామాలలోనూ ఉన్నట్టే లెక్క. నిరుడు పిల్లల మరణాల గురించి గొడవ జరిగినప్పుడు ఒక నెలరోజుల పాటు పల్లీలు, బెల్లం కలిపిన ఆహారం వీటి ద్వారా పిల్లలకు అందిచ్చారు. ఆ తరువాత వార్తలలో వేరే విషయాలు చోటు చేసుకున్నాక ఇంక అనవసరం అనుకున్నారు.

వర్షాకాలం ఇంకా మొదలుకాక ముందే ఈ విషయాలు చెప్పుకోవడంలో ఉద్దేశం ఈ సారయినా ముందు జాగ్రత్త వహిస్తారేమోనని. దానికోసం ఉద్యమించగల వాళ్ల ఇప్పుడయినా కదులుతారేమోనని.